మహా ప్రదర్శనను విజయవంతం చేయాలి

నాగోలు: ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్‌ చేస్తూ ఎమ్మార్పీఎస్‌ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7 హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు వేల గొంతుల మాదిగల సాంస్కృతిక మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్‌ ఎల్‌బీనగర్‌ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్‌ మాదిగ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి ఎల్‌బీనగర్‌లోని అన్ని డివిజన్ల నుంచి మాదిగలు భారీగా తరలిరావాలన్నారు.

రాజశేఖర్‌రెడ్డికి అదనపు బాధ్యతలు

చాదర్‌ఘాట్‌: హైదరాబాద్‌ రీజియన్‌ మార్కెటింగ్‌ జాయింట్‌ డైరెక్టర్‌గా కె.రాజశేఖర్‌రెడ్డి గురువారం మలకపేటలోని హైదరాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన ఆర్‌జేడీ ఈ.మల్లేషం నెల రోజులు సెలవులపై వెళ్లటంతో రాజశేఖర్‌రెడ్డికి అదనపు బాధ్యతలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌కు వచ్చే రైతుల సమస్యలపై దృష్టి సారించాలన్నారు.

రేపు డీడీసీవోపీ గ్రాడ్యుయేషన్‌ డే

నల్లకుంట: నల్లకుంటలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ కాలేజీ ఆఫ్‌ ఫిజియో థెరపీ(డీడీసీవోపీ) గ్రాడ్యుయేషన్‌ డే ఈనెల 18న నిర్వహించేందుకు అని ఏర్పాట్లు చేశామని డీడీసీవోపీ ప్రిన్సిపాల్‌ ఛాయ నందిని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యానగర్‌ దుర్గాబాయ్‌ దేశ్‌ముఖ్‌ ఆస్పత్రి ఆవరణలో ఉన్న డీడీ హెచ్‌ అండ్‌ రీసెర్చ్‌ సెంటర్‌ ఆడిటోరియంలో ఉదయం 11గంటలకు కార్యక్రమం ప్రాంభమవుతుందని చెప్పారు. పాట్నా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్‌ ఎల్‌. నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పట్టాలు అందజేసి ప్రసంగిస్తారని తెలిపారు. ఆతిథ్య అతిథిగా డీడీఎంఎస్‌ ప్రెసిడెంట్‌ ఉషాకంద హాజరవుతారన్నారు.





ఎల్‌బీనగర్‌ మూడు సర్కిళ్ల పరిధిలోని పలు కాలనీల్లో రహదారుల్లో గుంతలు పడి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఎక్కడ ఎప్పుడు తవ్వి వదిలేస్తారో తెలియక వాహనదారులు గందరగోళానికి గురవతున్నారు. పలు కాలనీల్లో ఎవరి అనుమతులు లేకుండా రాత్రుల్లో తవ్వి వదిస్తుండటంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయి. గుంతమయంగా మారిన రోడ్లతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడ్డిఅన్నారం డివిజన్‌ లలితానగర్‌ కాలనీలోని పలు రోడ్లు అధ్వాన్నంగా మారి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నల్లా, డ్రైనేజీ లైన్‌ తీసుకున్న ఇళ్ల యజమానులు రోడ్లు తవ్వి అలాగే వదిలేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇష్టానుసారంగా రోడ్లు తవ్వుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

–ఎల్‌బీనగర్‌, చైతన్యపురి

ఎవరు తవ్వుతారో.. ఎందుకు తవ్వుతున్నారో?

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.15, వంకాయ రూ.23, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్‌ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్‌ రూ.37, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.28, ఉల్లిగడ్డ రూ.32, గోకరకాయ రూ.23, దోసకాయ రూ.23, సొరకా య రూ11, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.38, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.65, బీట్‌ రూట్‌ రూ.37, కీర రూ.35, బీన్స్‌ రూ.55, క్యాప్సికమ్‌ రూ.45. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

నేడు డయల్‌ యువర్‌ డీఎం

నాగోలు: ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం బండ్లగూడ డిపోలో శుక్రవారం డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మేనేజర్‌ వెంకటేశం ఓప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు బస్సుల నిర్వహణ, ప్రయాణికుల ఇబ్బందులు ఇతర అంశాలు, సలహాలు, సూచనల కోసం 9959224058 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నియామకం



దినేష్‌

మలక్‌పేట: బీజేపీ మూసారంబాగ్‌ డివిజన్‌ అధ్యక్షుడిగా కొప్పుల దినేష్‌ నియమితులయ్యారు. ఈ సందర్భంగా దినేష్‌ మాట్లాడుతూ.. ప్రజా సమస్య పరిష్కారానికి నిరంతరం పోరాటం, డివిజన్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

రేషన్‌కార్డుల సర్వే షురూ



సర్వే సిబ్బందితో సమావేశమైన డీసీ జయంత్‌

చాదర్‌ఘాట్‌: రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేసింది. అర్హులను గుర్తించేందుకు కసరత్తు చేస్తుంది. మలక్‌పేట్‌ జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–6 పరిధిలో మొత్తం 2977 మంది కులగణన సర్వే ద్వారా రేషన్‌కార్డులు లేని కుటుంబాల జాబితాను తయారు చేసి జిల్లా కలెక్టర్‌ ద్వారా నియోజకవర్గాల వారీగా జీహెచ్‌ఎంసీ సర్కిల్‌ కార్యాలయాలకు పంపించారు. జాబితాలోని దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివిధ అంశాలపై వివరాలను సేకరించి అర్హులా.. కాదా అని సిబ్బంది గుర్తించాల్సి ఉంటుంది. సర్కిల్‌–6 డీసీ జయంత్‌ను రేషన్‌కార్డుల పరిశీలన ప్రక్రియకు నియోజకవర్గం నోడల్‌ అధికారిగా నియమించారు.

డివిజన్ల వారీగా జాబితా..

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే నిర్వహించిన కులగుణన సర్వేలో రేషన్‌కార్డులు లేని వారిని గుర్తించి వారి జాబితాను రూపొందించారు. అదే జాబితాను సర్కిల్‌ కార్యాలయాలకు పంపించి వారి పూర్తి వివరాలను సేకరించి రేషన్‌కార్డులకు అర్హులా కాదాని ధ్రువీకరించాల్సి ఉంది. ఈ ప్రక్రియకు మలక్‌పేట సర్కిల్‌లో రెవెన్యూ శాఖకు చెందిన కొత్తగా ఎంపికైన గ్రూప్‌–4 సిబ్బందితో పాటు మరికొంత మందిని ఎంపిక చేసి జాబితా ఆధారంగా పరిశీలన ప్రక్రియను గురువారం నుంచి ప్రారంభించినట్లు డీసీ జయంత్‌ తెలిపారు. సర్వే సిబ్బందితో సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు. సర్వే 21వ తేదీ లోపు పూర్తి చేయాలని, ఒక్కొక్కరు 150 ఇళ్ల సర్వే చేయాలన్నారు. కులగణన సర్వేలో సైదాబాద్‌ డివిజన్‌లో 438, మూసారాంబాగ్‌లో 380, పాత మలక్‌పేటలో 849, అక్బర్‌బాగ్‌లో 332, అజంపురాలో 659, ఛావునీలో 319 మంది రేషన్‌కార్డులు లేని కుటుంబాలు ఉన్నాయన్నారు.

సారు ఫీల్డ్‌పై వెళ్లారు!

కార్యాలయాల్లో అందుబాటులో ఉండని అధికారులు

- డివిజన్లలో వేధిస్తున్న సమస్యలు



సరూర్‌నగర్‌ సర్కిల్‌ కార్యాలయం

దిల్‌సుఖ్‌నగర్‌: కాలనీలు, బస్తీల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. అభివృద్ధిని మరిచిన అధికారులు కాలనీలను పట్టించుకోవడం ఎప్పుడో మరిచారు. సర్కిల్‌ కార్యాలయంలో సమస్యలపై రివ్యూలు లేవు, పైస్థాయి అధికారులు చెప్పినా కిందిస్థాయి అధికారులు, సిబ్బంది పట్టించుకోవడంలేదు. మలక్‌పేట్‌జోన్‌ పరిధిలోని మలక్‌పేట్‌ సర్కిల్‌, సరూర్‌నగర్‌, సంతోష్‌నగర్‌ సర్కిళ్ల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది ఎవరూ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. సమస్యలను చెప్పుకునేందుకు కార్యాలయాలకు వెళ్తే సార్‌ ఫీల్డ్‌పై వెళ్లారనే సమాధానం తప్ప ఎప్పుడు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు గుప్పమంటున్నాయి.

పేరుకుపోతున్న ఫిర్యాదులు..

ఆర్‌కేపురం, సరూర్‌నగర్‌, ఐఎస్‌సదన్‌, కుర్మగూడ, సైదాబాద్‌, అక్బర్‌బాగ్‌, ఓల్డ్‌మలక్‌పేట్‌, తదితర డివిజన్లలో సమస్యలు తాండవిస్తున్నాయి. సర్కిల్‌ కార్యాలయాలలో పారిశుద్ధ్య, ఇంజినీరింగ్‌, టౌన్‌ ప్లానింగ్‌, ఎలక్ట్రికల్‌, హార్టికల్చర్‌, రెవెన్యూ తదితర విభాగాలకు చెందిన అధికారులెవ్వరు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. ప్రతిరోజు వివిధ పనులపై ఉదయం నుంచి సాయంత్రం వరకు వచ్చే స్థానికులతో సర్కిల్‌ కార్యాలయం కిటకిటలాడుతుంది. వచ్చిన వారికి అధికారులెవ్వరు లేకపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. దీంతో పెండింగ్‌లో ఫైల్స్‌ కుప్పలుతెప్పలుగా పేరుకుపోయితున్నాయి. డివిజన్లలో అభివృద్ధి కుంటుపడింది. మామూళ్లు సమర్పించుకునే దళారీలు, కాంట్రాక్టర్ల ఫైల్స్‌ తప్ప సామాన్యుల సమస్యలు పరిష్కరించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

పొంతన లేని సమాధానాలు..

సర్కిళ్ల పరిధిలో మూసారంబాగ్‌, సైదాబాద్‌, అజంపుర, ఛావునీ తదితర డివిజన్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రోజు రోజు కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఇలా రోజుకు దాదాపుగా వందకు పైగానే సమస్యలు వస్తుంటాయి. వీటిలో అధికశాతం అక్రమ నిర్మాణాలు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్య సమస్యలు ఎక్కువగా వస్తుంటాయి. వచ్చిన ఫిర్యాదులను వెంటనే డీసీ వాటిని సంబంధిత అధికారులకు పంపించినా అధికారులెవ్వరు పట్టించుకోవడంలేదు, దీనిపై వారితో మాట్లాడామంటే ఎవ్వరు అందుబాటులో ఉండటం లేదు అడిగితే పొంతనలేని సమాధానాలు, దీనితో చేసేదేమీలేక ఆయన ఊరకుండిపోవడం రివాజుగా మారిపోయింది. గత కొన్ని నెలలుగా ఇదే తంతు జరుగుతుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

దళారుల ఫైళ్లను ప్రాధాన్యం..

సమస్యలు పరిష్కరించకపోతే సర్కిల్‌ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని ఆయా ప్రాంతాల ప్రజలు హెచ్చరిస్తున్నారు. కొన్ని నెలలుగా సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సంబంధిత అధికారులెవ్వరు ఉండటం లేదని వారు ఎప్పుడో ఒకసారి సర్కిల్‌ కార్యాలయానికి వచ్చి దళారులు చెప్పిన ఫైళ్లను మాత్రమే పరిశీస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

చెక్కుల అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: అర్హులంతా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌ బలాల అన్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్‌,ఎల్‌ఓసీ చెక్కులను గురువారం ఆయన పంజేషాలోని కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఊరెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల..

5 తులాల బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు

మేడిపల్లి: ఊరెళ్లొచ్చేసరికి వరుసగా రెండు ఇళ్లల్లో తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్‌ మున్సిపల్‌ పరిధి తిరుమల మెడోస్‌ గేటెడ్‌ కమ్యూనిటీ కాలనీలో నివాసం ఉంటున్న మహమ్మద్‌ అజీద్‌, కూర్వెళ్ల ప్రతాప్‌ నగరంలో ప్రైవేట్‌ ఉద్యోగులు. కాగా గత మూడు రోజుల క్రితం కుటుంబసభ్యులతో కలిసి ఊరెళ్లి తిరిగొచ్చేసరికి ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూసేసరికి వారి ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించిన బాధితులు బుధవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు జంగారెడ్డి



విజేతలకు షీల్డ్‌ను అందజేస్తున్న నాయకులు

మహేశ్వరం: క్రీడలు ఆడడంతో శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత పెంపొందుతుందని కందుకూరు, కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం కందుకూరు గ్రామంలో గత పది రోజుల నిర్వహిస్తున్న ప్రీమియర్‌ క్రికెట్‌ లీగ్‌(కేపీఎల్‌–6) పోటీలు ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన నగదు బహుమతి, షీల్డ్‌ కప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణా ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తామన్నారు. పోటీల్లో గెలుపొందిన విన్నర్‌ జట్టుకు రూ.25వేల నగదు, షీల్డ్‌, రన్నర్‌ జట్టుకు రూ.15వేల నగదు బహుమతి, షీల్డ్‌ను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకుడు సరికొండ పాండు, సురసాని వీరారెడ్డి, ప్రశాంత్‌కుమార్‌, పాముల కృష్ణ, గాదే కుమార్‌, జగదీశ్‌, సుపర్‌ కృష్ణారెడ్డి, సరికొండ జగన్‌, అజీజ్‌, శ్రీనివాస్‌, ఉదయ్‌, రాజశేఖర్‌, శేఖర్‌, ప్రశాంత్‌, సల్మాన్‌ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యం



హెల్మెంట్‌ ధరించిన వారికి గులాబీ పువ్వును అందజేస్తున్న అడిషనల్‌ సీపీ విశ్వప్రసాద్‌

అబిడ్స్‌: రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహిస్తున్నామని హైదరాబాద్‌ సిటీ ట్రాఫిక్‌ అడిషనల్‌ కమిషనర్‌ విశ్వప్రసాద్‌ తెలిపారు. అబిడ్స్‌ జీపీఓ చౌరస్తాలో ట్రాఫిక్‌ పోలీసులు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సెంట్రల్‌ జోన్‌ ట్రాఫిక్‌ డీసీపీ అశోక్‌కుమార్‌, ఏసీపీ ఎర్న, అబిడ్స్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ లంకల రవికుమార్‌తో కలిసి అడిషనల్‌ సీపీ పాల్గొన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌ నిబంధనలు పాటిస్తూ వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బైక్‌ నడిపేటప్పుడు హెల్మెంట్‌ తప్పనిసరిగా ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగితే ఆ కుటుంబాలు ఆసరా కోల్పోయి రోడ్డున పడుతాయన్నారు. ఈ సందర్భంగా హెల్మెంట్‌ ధరించని వాహనదారులకు కౌన్సెలింగ్‌ ఇస్తూ హెల్మెంట్‌ ధరించిన వారికి ఫ్లవర్స్‌ ఇచ్చి అభినందించారు. ఆగాఖాన్‌ కమ్యూనిటీ మహిళలు ట్రాఫిక్‌ రూల్స్‌పై ప్లకార్డులు పట్టుకొని వాహనదారులకు అవగాహన కల్పించారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్‌



శ్రీరాములును సత్కరిస్తున్న నూతన అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేశ్‌

మీర్‌పేట: ప్రజా సమస్యలపై పోరాటం చేయడంతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌ పిలుపునిచ్చారు. బీజేపీ మీర్‌పేట–1, 2 అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన పసునూరి భిక్షపతిచారి, ముఖేశ్‌లు గురువారం శ్రీరాములును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి కలసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా శ్రీరాములు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ కీసర హరినాథ్‌రెడ్డి, నాయకులు శ్యాంసుందర్‌, తులసి వెంకటేశ్‌, కాశీరాం యాదవ్‌, జగన్‌ తదితరులు ఉన్నారు.

యోగ్యతలేని భూములకు ‘రైతుభరోసా’ రాదు

- తహసీల్దార్‌ సైదులు



మహేశ్వరంలో భూ రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్‌, ఆర్‌ఐ

మహేశ్వరం: సాగుకు యోగ్యత లేని భూములను గుర్తించి రైతు భరోసా పథకం నుంచి తొలగిస్తామని తహసీల్దార్‌ సైదులు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మహేశ్వరం, సిరిగిరిపురం, దిల్‌వార్‌గూడ, అమీర్‌పేట్‌, చిన్న తూప్ర గ్రామాల్లో రైతు భరోసా లబ్ధిదారుల ఎంపికకు సాగుకు యోగ్యతలేని భూముల వివరాలను సేకరించేందుకు రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీ కార్యదర్శులతో కలిసి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగుకు యోగ్యత లేని భూములకు రైతు భరోసా దక్కదన్నారు. ప్రధానంగా రాళ్లు, రప్పలు, గుట్టలు, రోడ్ల నిర్మాణంలో కోల్పోయిన భూములు, మైనింగ్‌ చేస్తున్న భూములు, నాలా కన్వర్షన్‌ అయిన భూములు, రియల్‌ ఎస్టేట్‌ వెంచర్లు చేసిన భూములు, పరిశ్రమలకు తీసుకున్న భూములు, రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన భూములు, చెరువులు, కుంటలలో ఉన్న భూములకు రైతు భరోసా వర్తించదన్నారు. సాగు యోగ్యతలేని భూములను గుర్తించేందుకు రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో ఫీల్డ్‌ సర్వే నిర్వహించి రైతు భరోసా పథకం నుంచి తొలగిస్తున్నామని తెలిపారు. అంతకుముందు గ్రామాల్లో పలు భూములు, రికార్డులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ స్వర్ణకుమారి, పావని, సీనియర్‌ అసిస్టెంట్‌ ప్రేమ్‌కుమార్‌, వ్యవసాయ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హత్యకు గురైన యువకుడి గుర్తింపు

కుషాయిగూడ: చర్లపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం హత్యకు గురైన 35 ఏళ్ల యువకుడి వివరాలను పోలీసులు తెలుసుకున్నారు. జార్ఖండ్‌కు చెందిన బాబు సోల్‌టాడుగా తేల్చి అతడి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చినట్లు ఇన్‌స్పెక్టర్‌ రవికుమార్‌ తెలిపారు. మృతుడి జేబులో లభించిన థర్డ్‌ పర్సన్‌ బ్యాంకు నెంబరు ఆధారంగా అచూకీ తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. కాగా మృతుడికి వివాహమైందని, భార్యాభర్తలు విడిపోవడంతో వేర్వేరుగా ఉంటున్నట్లు చెప్పారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చినప్పటికీ వారు వస్తారనే నమ్మకం కనిపించడం లేదని పోలీసులు చెబుతున్నారు. దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు.



రోడ్లపై సంత.. రాకపోకలకు చింత

వనస్థలిపురం: అంతర్గత రహదారులు, రోడ్లపై నిర్వహిస్తున్న సంతలతో దారంత కుంచించుకపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎల్‌బీనగర్‌ నియోజకవర్గం పరిధిలోని బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ పరిధిలో బీడీరెడ్డి గార్డెన్‌ నుంచి మీర్‌పేటకు వెళ్లే రోడ్డు, బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ సాహెబ్‌నగర్‌లో, వనస్థలిపురం డివిజన్‌ శ్రీనివాసపురం కాలనీలో, వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి సమీపంలో, హస్తినాపురం జెడ్పీ రోడ్డులో, వనస్థలిపురం సచివాలయనగర్‌లో, ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న సంతలతో ట్రాఫిక్‌జామ్‌ సమస్యతో ఇక్కట్లు పడుతున్నామని ఆయా ప్రాంతాల వారు వాపోతున్నారు. ఆయా కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో సంతలు ఏర్పాటు చేస్తే సౌకర్యవంతంగా ఉంటుందని కోరుతున్నారు.

